చెక్కని గుమ్మాలు

సండే స్పెషల్

- ఆకట్టుకునే డిజైన్లలో దర్వాజలు, తలుపులు
- రూ.లక్షలు వెచ్చించి తయారు
- ఖర్చుకు వెనుకాడని ప్రజలు



నెల్కివెంకటాపూర్‌లో ఓ ఇంటి గుమ్మం



తలుపులకు ఆకట్టుకునే దేవత చిత్రాలతో కార్వింగ్

దండేపల్లి: పల్లెప్రజలు ఇంటి నిర్మాణ ఖర్చుల్లో తగ్గేదేలే.. అంటున్నారు. డబుల్ బెడ్రూంలు, బహుళ అంతస్తులు, పెంట్‌హౌజ్‌లు, వాటిల్లో ఎన్నో హంగులు కనిపిస్తున్నాయి. హరివిల్లును మించి రంగులు, ఇంటీరియల్ డెకోరేషన్, హాలు, వంటగది, డైనింగ్ ఏరియా, మాస్టర్ బెడ్రూం, చిల్డ్రన్ బెడ్‌రూంలు, ఇంట్లో ఇలా అనేక రకాలుగా వసతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. సీలింగ్‌లో మిరుమిట్లు గొలిపే లైట్లు, ఇంటి గుమ్మాలు ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. ఒకప్పుడు ఇంటి గుమ్మానికి మామూలు దర్వాజలు, తలుపులు పెట్టుకునేది. ఇప్పుడు ఇంటి గుమ్మం ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆర్చి దర్వాజలు, కార్వింగ్ డిజైన్లు వేయించడంతో ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఏ మాత్రం ఖర్చుకు వెనకాడకుండా పల్లెప్రజలు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇంటి ప్రధాన గుమ్మానికి దర్వాజ, తలుపులతో కలిసి ఒక్కదానికి సుమారు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

తయారీకి 40రోజుల పైనే..

సాధారణ ఆర్చి దర్వాజ, తలుపుల తయారీకి వారం రోజులు సమయం పడితే, కార్వింగ్ డిజైన్‌తో తయారు చేసే దర్వాజాలు, తలుపుల తయారీకి మాత్రం సుమారు 40రోజుల పైనే సమయం పడుతోంది. నాణ్యమైన టేకు కర్రతో, ఆర్చీ దర్వాజలు చేయడంతో పాటు, కార్వింగ్‌తో అందమైన డిజైన్లు, సంగడితో తయారు చేసిన సైడ్ పిల్లర్లు, వెలివేషన్ కోసం అద్దాలు బిగించడంతో గుమ్మాన్ని మరింత ఆకట్టుకుంటున్నాయి. ఇంటి ప్రధాన గుమ్మంతో పాటు, పూజగదికి కూడా ప్రత్యేక డిజైన్లతో దర్వాజాలు, తలుపులు, పూజ మందిరానికి ప్రత్యేక కార్వింగ్ డిజైన్లు చేయిస్తున్నారు.

కార్వింగ్‌లో ఆకట్టుకునే డిజైన్లు..

ఇంటి గుమ్మాలతో, పాటు తలుపులకు కార్వింగ్ ద్వారా ఆకట్టుకునే డిజైన్లు, అందులో వినాయకుడు, లక్ష్మీ, సరస్వతి, శివపార్వతులు, బాలాజీ, శంఖు చక్రాలు, ఓం, స్వస్తిక్ గుర్తులు, ఇవే కాకుండా స్వాగతం పలికే చిత్రాలతో పాటు, నెమలి, తామర పువ్వులు, పూల కుండీలు, ఇలా రకరకాల కార్వింగ్ డిజైన్లను ఇంటి గుమ్మాలకు వేయడంతో అవి ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండటంతో పాటు, ఇంటికి వచ్చేవారిని డిజైన్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఆకర్షణగా ఉంటుందని..



ఇంటి ప్రధాన గుమ్మం, ప్రత్యేక ఆకర్షణగా ఉండేందుకు ఖర్చుకు వెనకాడకుండా, నాణ్యమైన కర్రతో పాటు, మంచి డిజైన్‌తో కూడిన కార్వింగ్‌తో డిజైన్లు, వేయించాను. సైడ్‌కు కర్రతో తయారు చేసిన సంగడి పిల్లర్లు, ఇంట్లోకి వెలివేషన్ వచ్చేలా అద్దాలు బిగించడంతో, ఇంటి ప్రధాన గుమ్మం ఎంతో ఆకర్షణగా కనిపిస్తుంది. చాలా మంది బాగుందని చెప్పారు.

- గడ్డం రాంచందర్, మేదరిపేట

ఖర్చుకు వెనకాడటం లేదు..



చాలా మంది ఇంటి నిర్మాణంలో కర్ర దర్వాజాలు, తలుపులు, మరీ ముఖ్యంగా పూజగదులకు కార్వింగ్ డిజైన్ కోరుకుంటున్నారు. వాటికి అయ్యే ఖర్చుకు ఏ మాత్రం వెనకాడటం లేదు. వారు కోరుకున్న డిజైన్లతో కార్వింగ్ చేస్తున్నాం. దీంతో ఇంటి ప్రధాన గుమ్మాలకు మంచి, మంచి డిజైన్లు, పూజ గదుల తలుపులకు కూడా ఆకట్టుకునే డిజైన్లుతో కార్వింగ్ చేస్తున్నాం.

- చటన్నోజు సతీశ్, కార్వింగ్ డిజైనర్

క్లుప్తంగా

ఇంటింటా ఆరోగ్య పరీక్షలు



వివరాల సేకరణలో వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లి గ్రామంలో శనివారం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ఇంటింటా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఏ.లహరి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటూ అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు ఇచ్చారు. ముఖ్యంగా జ్వరాల బారిన పడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో వేంపల్లి ఎంపీటీసీ డేగ బాపు, పీహెచ్‌సీ హెచ్‌ఈఓ రఘుపతి, సూపర్‌వైజర్ పద్మ, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసరెడ్డి, రమేశ్, ల్యాబ్ టెక్నీషియన్ వరప్రసాద్, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమనిర్మాణం అడ్డగింత



అక్రమంగా చేపట్టిన నిర్మాణం

మందమర్రిరూరల్: ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని మొదటిజోన్‌లో మూడు రోజుల క్రితం ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టగా, స్థానికులు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో శనివారం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అక్కడికి వెళ్లి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణం నిలిపివేయాలని వారిని ఇదివరకే ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక కూడా పంపించినట్లు వివరించారు.

'పేదలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

పాతమంచిర్యాల: చెన్నూర్‌లో పేదలపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఎం.బి భవన్‌లో శనివారం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పేదలు చేస్తున్న ఇళ్ల స్థలాల పోరాటాన్ని దెబ్బతీయడం కోసం చెన్నూర్‌లో భూ కబ్జాదారులు, రౌడీలు పేదల గుడిసెలను కాల్చివేయడం, మహిళలపై దాడులు చేయడం, మహిళలను కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు ప్రకాష్, అశోక్, దాసరి రాజేశ్వరీ పాల్గొన్నారు.

గ్రామాల్లో హెల్త్ క్యాంపులు



మందులు అందజేస్తున్న హెల్త్ సిబ్బంది

వేమనపల్లి: మండలంలోని కల్లంపల్లి, ముక్కిడిగూడం, ముల్కలపేట గ్రామాల్లో శనివారం వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించి, అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేశారు. చిన్న పిల్లలకు టీకాలు, గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్‌ఎంలు రాజ్యలక్ష్మి, ఉమాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల భిక్షాటన



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

పాతమంచిర్యాల: తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, దుర్గం ఎల్లయ్య, యాకూబ్‌రెడ్డి, సమ్ము రాజయ్య మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అన్ని కెటగిరీల ఉద్యోగులు పాల్గొన్నారు.

నెల్కివెంకటాపూర్‌లో 'నా మట్టి–నాదేశం'



మట్టి సేకరిస్తున్న రఘునాథ్

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ శనివారం 'నా మట్టి–నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం త్యాగం చేసి అమరులైన వారి కోసం, దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించే స్మృతివనం నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా మట్టి సేకరణ జరుగుతుందన్నారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు గాదె శ్రీనివాస్, ముత్తినేని మల్లేష్, బత్తుల శేఖర్, శ్రీధర్, శ్రీనివాస్, వెంకటేష్, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణలో వలంటీర్లు

మంచిర్యాలఅర్బన్: అజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక వలంటీర్లు శనివారం మంచిర్యాలలో మట్టి సేకరణ చేపట్టారు. జాతీయ సేవా పథకం జిల్లా కన్వీనర్ ఉదారి చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రాంతాల నుంచి మట్టి సేకరించి కళాశాల ప్రాంగణంలో అందజేశారు. సేకరించిన మట్టిని భారత ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపించనున్నట్లు చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. అనంతరం రాముని చెరువు పార్కు వద్ద మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు తిరుపతి, శేరీనా, రాజేశ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేసే వరకు రూ. 25 వేల వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ పనిచేస్తున్న స్థలంలో ప్రమాదం జరిగితే రూ.5లక్షలు చెల్లించాని కోరారు. ఈ నెల 20వ తేదీన ఈ అంశాలపైన కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షుడు సురేశ్, గౌతమ్ చందర్, శంకర్, ఆశయ్య, సుమన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న అగల్‌డ్యూటి రాజు

మంచిర్యాలటౌన్/నస్పూర్: మంచిర్యాల అసెంబ్లీ నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు బీసీ సామాజికవర్గం నుంచి డాక్టర్ రఘునందన్ శనివారం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మంచిర్యాలలో కంటి వైద్యుడిగా ఉన్న రఘునందన్ ఇటీవలే బీజేపీలో చేరారు. బీసీలకు టికెట్ ఇస్తారనే నమ్మకంతో మంచిర్యాల టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. బీసీ కోటాలో అవకాశం కల్పించాలని బీజేపీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు కూడా హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు.

కాళోజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- కాళోజీ జయంతి సందర్భంగా నివాళులు



భీమారం: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విశ్వంభర్

భీమారం: మండలంలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి తహసీల్దార్ విశ్వంబర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్సెట్టిపేట: కాళోజీ నారాయణరావు జయంతిని మండలంలోని సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు రవీందర్, రాజేశ్వర్‌రావు, రమణశ్రీ, కందుల తిరుపతి, గిరీష్, గౌతం పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: కాళోజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామునిచెరువు కట్టపై వాకర్ సభ్యుల ఆధ్వర్యంలో కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ప్రాంతేతరుడు దోపిడీ చేస్తే ప్రాంత పొలిమేరల వరకు తరిమికొట్టాలని, ప్రాంతం వాడే దోపిడీ చేస్తే.. ఈ ప్రాంతంలోనే పాతి పెట్టాలని కాళోజీ తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని గుర్తు చేశారు. కాళోజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటయ్య, ఐలన్న, మల్లేశం, జ్ఞాని, ప్రకాశ్, ఎంఎస్ పాషా, కె.గౌరయ్య, యాదవ్, సలీం, అపర్ణ పాల్గొన్నారు.

శతావధాని కవి దంపతులకు సన్మానం

భారత జాగృతి వారి ఆధ్వర్యంలో తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శతావధాని కవి, ప్రొఫెసర్ డాక్టర్ పట్వర్ధన్ దంపతులతో పాటు, 30మంది కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు, సాహిత్య విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేశం గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు మేడి రాజశేఖర్, శ్రీనాథ్ గౌడ్, సిడం శంకర్, దొంతుల కృష్ణకాంత్ పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న సభ్యులు



నివాళులర్పిస్తున్న వాకర్ సభ్యులు

రాజీపడడమే రాచమార్గం



చెన్నూర్: కక్షిదారులను విచారిస్తున్న జడ్జి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్



బెల్లంపల్లి: మాట్లాడుతున్న జడ్జి ముకేశ్

చెన్నూర్: రాజీ పడడమే రాజ మార్గమని సివిల్ జడ్జి సంపత్ అన్నారు. స్థానిక మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో శనివారం సుప్రీంకోర్ట్ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా న్యాయ సేవా అధికార సంస్థ నేతృత్వంలో సుప్రీంకోర్ట్ జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుందన్నారు. ఇరు పక్షాలు తప్పులను తెలుసుకొని కలిసి, మెలిసి ఉండేందుకు లోక్ అదాలత్ కక్షిదారులకు మంచి వేదికన్నారు. లోక్ అదాలత్‌లో చెన్నూర్ కోర్టు పరిధిలో గల 543భూ సమస్యలు, మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడ్డ, భార్యభర్తల, సివిల్ కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారం కోసం పోలీసుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ సీఐ వాసుదేవరావు, రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సైలు, ఏజీపీ రాంభావు, న్యాయవాదులు రమేశ్‌చందర్ గిల్డాలు పాల్గొన్నారు.

'యువత వ్యసనాలకు బానిసకావొద్దు'

లక్సెట్టిపేట: యువత వ్యసనాలకు బానిస కావొద్దని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడారు. యువత మద్యానికి బానిసై బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని, మద్యం తాగి వాహనాలు నడుపుతూ కోర్టుకు వచ్చిన వారి సంఖ్య పెరుగుతుందన్నారు. కక్షిదారులు రాజీపడితే ఇద్దరు గెలుస్తారని, రాజీ కుదుర్చుకుని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న తగాదాలతో పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులు వృథా చేసుకుంటున్నారని గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, మత్యంతాగి వాహనాలు నడిపితే మొదటి సారి జరిమానా విధిస్తారని, రెండో సారి జైలుకు పంపిస్తూ, లైసెన్సు రద్దు చేస్తారని హెచ్చరించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు, సీఐ, ఎస్సై పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అధాలత్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 877కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. నిర్విరామంగా పోలీసులు, కోర్టు సిబ్బంది కొద్ది రోజుల నుంచి చేస్తున్న లోక్ అదాలత్ కేసుల పరిష్కారం కోసం కృషి చేసిన సిబ్బందిని జడ్జి అసదుల్లా షరీఫ్ అభినందించారు.

'లోక్ అదాలత్‌లో 1143కేసులు పరిష్కారం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1143కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముకేశ్ కక్షిదారులు రాజీకి వచ్చిన కేసులను పరిష్కారం చేశారు. రూ.7,54,380 జరిమానా రూపంలో వసూలైంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో రాజీకి రావడం ఉత్తమ మార్గమన్నారు. రాజీకి రావడం వల్లనే బెల్లంపల్లి కోర్టు పరిధిలో అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్ కక్షిదారుల్లో ద్వేషాలను చల్లబరుస్తుందన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి అత్యధిక కేసులు పరిష్కారం కావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి రాజేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వేజ్‌బోర్డ్ బకాయిలు ఒకే దఫా చెల్లించాలి



ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన 23నెలల వేజ్‌బోర్డ్ బకాయిలు ఆలస్యం చేయకుండా ఒకే దఫా వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట శనివారం ఒక రోజు దీక్ష చేపట్టారు. ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి అక్బర్‌అలీ దీక్ష పరులకు దండ వేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోలిండియాలో ఈ నెల 3న వేజ్‌బోర్డ్ బకాయిలు చెల్లించారని, సింగరేణిలో ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. సింగరేణి ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం బకాయిల చెల్లింపుల విషయంలో ఆలస్యం చేస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు దాగం మల్లేష్, ఆంజనేయులు, వెంకటస్వామి, శ్రీనివాస్, తిరుపతి, మల్లయ్య, బాణయ్య, శర్మ, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

జాతరకు ఆలయం ముస్తాబు

చెన్నూర్: కొలిచిన వారికి కొంగ బంగారంగా పేరొందిన మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. పట్టణంలోని గోదావరి రోడ్డులో గల మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఏటా శ్రావణ మాసంలో చివరి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముగిసిన ఎక్కాహం

వేమనపల్లి: శ్రావణ మాసం చివరి వారం పురస్కరించుకొని మండలంలోని నాగారంలో నిర్వహించిన ఎక్కాహం శనివారం ముగిసింది. శుక్రవారం ప్రారంభమైన ఎక్కాహం భక్తుల భజన కీర్తనలతో రెండో రోజు కొనసాగింది. ముగింపు సందర్భంగా భజన బృందానికి, గ్రామస్తులకు సర్పంచ్ స్వరూపారాణి, రైతు సమన్వయ సంఘం మండల అధ్యక్షుడు భీమయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

9వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్



ప్రజలతో మాట్లాడుతున్న రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు రంగంపేటలో శనివారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా పలు పథకాలను చేపడుతున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకొస్తే, వెంటనే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సుని త, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, డీసీసీబీ డైరెక్టర్ తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రా మంలోని పలువురు కార్యకర్తలు శనివారం యువజన నాయకులు నడిపెల్లి విజిత్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన సుమారు యాభై మంది కార్యకర్తలకు ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్షలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళన భాగంగా తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు ఆందోళన విరమించేదిలేదని ప్రకటించారు.